క్లుప్తంగా

నేడు జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన


డీఈఓ ఎన్.ప్రేమ్ కుమార్

పార్వతీపురంటౌన్: జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన శనివారం జరుగుతుందని జిల్లా విద్యా శాఖ అధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి బెలగాం చర్చివీధి డీవీఎం పాఠశాలలో ఈ ప్రదర్శన జరుగుతుందని, కార్యక్రమానికి ఎమ్మెల్యే అలజంగి జోగారావు అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు రూపొందించిన మోడల్స్‌ను ప్రదర్శిస్తారన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొంటారని చెప్పారు.

పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- ఆర్డీఓ హేమలత


విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీఓ హేమలత

పార్వతీపురంటౌన్: పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని, ప్రతి ఒక్కరూ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాలని రెవెన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత పిలుపునిచ్చారు. పాఠశాల సందర్శన కార్యక్రమంలో భాగంగా ఆమె శుక్రవారం పార్వతీపురంలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన జాతీయ గణిత దినోత్సవంలో పాల్గొన్నారు. తరగతి గదులు సందర్శించి బోధన, వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పుస్తకాలను, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలని, పాఠ్యాంశాలలో అనుమానాలుంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి


తహసీల్దార్ అప్పలరాజుకు వినతిపత్రం అందిస్తున్న వీఆర్ఏలు

బలిజిపేట: వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల వీఆర్ఏలు తహసీల్దార్ అప్పలరాజుకు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఖాళీగా ఉన్న వీఆర్వో పోస్టులను వీఆర్ఏలతో భర్తీచేయాలి. 2018, జూన్ నుంచి జీతంతో కూడిన డీఏ ఇవ్వాలి. నామినీగా పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇవ్వాలి. రీ సర్వేలో వీఆర్ఏల సొంత గ్రామాలకు మాత్రమే పనులు ఇవ్వాలి. అక్రమ డ్యూటీలను చేయించరాదు. అన్ని విధాలా ఆదుకోవాలనే తదితర డిమాండ్లను పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో మండల వీఆర్ఏలు పాల్గొన్నారు.

రూ.25 లక్షలతో బుడ్డిపేటకు ఇంటింటి కుళాయిలు

సీతానగరం: మండలంలోని బుడ్డిపేటగ్రామానికి ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు రూ.25 లక్షలు నిధులు మంజూరు కావడంతో పనులకు మార్కింగ్ ఇచ్చామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.పవన్‌కుమార్ తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన గ్రామంలో పైప్‌లైన్ వేయడానికి పెదభోగిలి పంచాయతీ పాలకవర్గ సభ్యుడు ఎస్.వెంకటరమణతో కలిసి స్థలపరిశీలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా గ్రామంలో 165 ట్యాప్‌లు వేసేందుకు సిద్ధం చేశామని చెప్పారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తిచేసి ఇంటింటికీ తాగునీరు సరఫరా చేయడానికి అవసరమైన పనులు జరుగుతున్నాయని తెలియజేశారు.

భామినిలో కంది కొత్త పండుగ

భామిని: గిరిజన సంప్రదాయాల్లో ముఖ్యమైన కంది కొత్త పండుగ సందడి ఆరంభమైంది. మండల కేంద్రంలో తివ్వాకొండ గిరిజనులు శుక్రవారం పండగ ప్రదర్శన నిర్వహించారు. మణిగకు చెందిన గిరిజనలు డప్పు వాయిద్యాలతో నృత్యాలు చేసుకొంటు కొండదేవత పీఠం పట్టుకొని ఊరేగింపు చేపట్టారు. ఏటంగూడ, గజపతినగరం, భామినికి చెందిన గిరిజనులు కొండపై పండిన కంది పంట కోతకు ఆరంభంగా ఈ పండుగ జరుపుకొన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

జియ్యమ్మవలస: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన కార్యదర్శిగా నిమ్మక గోపాల్‌ను పార్టీ అధిష్టానం నియమించడంతో కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణిని ఆమె నివాసంలో శుక్రవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిసి, కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన బాధ్యతను చిత్తశుద్ధి, నిబద్ధతతో నెరవేరుస్తానన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే ఆయనను కోరారు.

జీవన ప్రమాణాలు మెరుగు పడేలా

మౌలిక సదుపాయాలు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు
- సీసీరోడ్డు, కాలువ నిర్మాణానికి శంకుస్థాపన


రిబ్బన్ కట్‌చేసి నూతన రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరిచే విధంగా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పార్వతీపురం పట్టణంలోని 25వ వార్డులో సీసీ కాలువ, రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే పూర్తయిన రహదారులను రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేశామన్నారు. ప్రజల కష్టాలను కళ్లారా చూసి వారి సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేసి రహదారులను ప్రభుత్వం నిర్మించిందని చెప్పారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేసి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తు న్నారని వివరించారు.


లబ్ధిదారులకు రైస్‌కార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

రేషన్ కార్డుల అందజేత

ఇటీవల రేషన్ కార్డులకు వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు నూతన రైస్ కార్డులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, వార్డు కౌన్సిలర్ ఎం.సుధీర్ కుమార్, ఆర్.చిన్నం నాయుడు, ఏఎంసీ డైరెక్టర్ గండి లక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.సుందరరావు, గోపి, ఆదినారాయణ, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశి పూజలకు సిద్ధం

- ఉత్తర ద్వారం ద్వారా వెంకటేశ్వరస్వామి దర్శనం


లక్ష్మీతిరుమల వెంకటేశ్వరస్వామి ఆలయంలో ముస్తాబైన ఉత్తర ద్వారం

సీతానగరం: ముక్కోటి ఏకాదశి పర్వదినం రోజున భక్తులు ఉత్తర ద్వారం ద్వారా వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకునే విధంగా వివిధ ఆలయాల్లో అర్చకులు శుక్రవారం ఏర్పాట్లు చేశారు. ముక్కోటి ఏకాదశి పర్వదినం రోజున ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకుంటే వైకుంఠ ప్రాప్తి కలుగుతుందని, సకల పాపాలు పోతాయన్న నమ్మకంతో భక్తులు ఆలయాలకు వెళ్లి ఉత్తద దిశలో ఉన్న ద్వారాం ద్వారా స్వామిని దర్శించుకోవడం ఆనవాయితీ. ఈ మేరకు లచ్చయ్యపేటలోని లక్ష్మీతిరుమల వెంకటేశ్వరస్వామి, వెంకటసత్యనారాయణ స్వామి ఆలయాల్లో భక్తులందకీ ఉత్తర ద్వారం ద్వారా ప్రవేశానికి ఏర్పాట్లు చేశారు. అలాగే సీతానగరంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు స్వామి దర్శనం కలిగే విధంగా ఏర్పాటు చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత


సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే కళావతి

పాలకొండ: నగర పంచాయతీలోని ఎన్‌కే రాజపు రం గ్రామానికి చెందిన నీలాపు సురేష్‌కు లక్ష రూపాయల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శుక్రవారం అందించారు. సురేష్‌కు అనారోగ్యం సోకడంతో వైద్య ఖర్చుల కింద సీఎం రిలీఫ్ ఫండ్ నగదు మంజూరు చేసింది. దీంతో సురేష్ కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కౌన్సిల ర్ నీలాపు శ్రీనివాసరావు, గోగుల అప్పలనాయు డు, బలగ బలరాం, గుండు శ్రీను, జద్దు జోగినాయుడు, నీలాపు శంకరరావు, తులసి శివ, జి.కిషో ర్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

గరుగుబిల్లి: గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో రైస్‌మిల్లుల వద్ద రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఆర్‌బీకేల ద్వారా మిల్లులకు తరలిన ధాన్యంలో తేమశాతం ఎక్కువగా ఉందని మిల్లు యజమానులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. స్పందించిన ఏవో విజయభారతి ఇప్పటికే ధాన్యం కొనుగోలుపై మిల్లర్లకు సలహాలు, సూచనలు చేయడం జరిగిందన్నారు. ఆర్‌టీసీ సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు తెలియజేసినప్పటికీ ఆర్‌టీసీ అధికారులు చొరవ చూపకపోవడంపై ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా మహిళా సంఘాలకు స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని ఏపీఎం అప్పలనాయుడు తెలిపారు.

పనులు పూర్తికాగానే టిడ్కో గృహాల అందజేత

పార్వతీపురంటౌన్: టిడ్కో గృహాల పనులు పూర్తికాగానే లబ్ధిదారులకు గృహాలు అందజేస్తామని ఏపీ టిడ్కో కార్యనిర్వాహక ఇంజినీర్ ఎస్.జ్యోతి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలో పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలో జి+3 పద్ధతిన 768 గృహాలకు రూ.39.60 కోట్లు, మౌలిక సదుపాయాలకు రూ.8.98 కోట్లు ఏపీ టిడ్కో మంజూరు చేసిందని ఆమె తెలిపారు. పార్వతీపురంలో 768 గృహాల పనులు 80 శాతం పూర్తయ్యాయని ఆమె చెప్పారు. మౌలిక సదుపాయాలైన రహదారులు, మురుగునీటి కాలువల పనులు జరుగుతున్నాయని, మురుగు నీటి శుద్ధి కేంద్రం పనులు 70 శాతం పూర్తయ్యాయని వివరించారు. నీటి సరఫరాకు రూ 5.28 కోట్లతో అంచనాలు వేసి పైఅధికారులకు పంపించామని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాకు రూ.3.08 కోట్లతో అంచనాలు వేసి అనుమతి రాగానే ఏపీ ఈపీడీసీఎల్ ద్వారా పనులు మొదలు పెట్టనున్నట్లు చెప్పారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై)లో భాగంగా ఏపీ టిడ్కో ఆధ్వర్యంలో పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలో ఏపీ టిడ్కో గృహ నిర్మాణ పనులను చేపట్టినట్లు ఆమె తెలిపారు. ప్రభుత్వం 300 చదరపు అడుగుల గృహాన్ని ఒక్క రూపాయికి మాత్రమే ఇస్తోందని, 365 చదరపు అడుగుల గృహానికి ముందస్తుగా కట్టవలసిన సొమ్మును రూ. 50 వేల నుంచి రూ.25 వేలకు, 430 చదరపు అడుగుల గృహానికి లక్ష రూపాయల నుంచి రూ.50వేలకు తగ్గించిందని వివరించారు. లబ్ధిదారులు చెల్లించిన మొత్తాన్ని ప్రభుత్వ ఆదేశాల జారీ మేరకు మున్సిపాలిటీ ద్వారా లబ్ధిదారుల వాటాను వారికి అందజేయనున్నట్లు ఆమె చెప్పారు. మౌలిక సదుపాయాలు, గృహాలు పూర్తి చేసి త్వరలో లబ్ధిదారులకు అందజేసేందుకు తగిన సన్నాహాలు జరుతున్నాయని స్పష్టం చేశారు.

అంగన్‌వాడీల మానవహారం

సీతానగరం: అంగన్వాడి కార్యకర్తలు, ఆయాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మె 11వ రోజుకు చేరుకుంది. ఈ మేరకు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధి నాయకులు ఎం.సత్యవతి, వి.రామలక్ష్మిల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల న్యాయమైన కోర్కెలు తీర్చాలని హనుమాన్ జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించారు. సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం వివిధ స్థాయిల్లో శాంతి యుతంగా జరుగుతుందని తెలియజేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సెక్టార్ నాయకులు పి.యశోద, ఆర్.లక్ష్మి, కె.శైలజ, రమణమ్మ పాల్గొన్నారు.

పెదబొండపల్లి హైస్కూల్‌లో గణిత దినోత్సవం


1729 ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

పార్వతీపురంటౌన్: మండలంలోని పెదబొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయురాలు గౌరి ఆధ్వర్యంలో గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా శ్రీనివాస రామానుజన్ 1729 ఆకారాన్ని విద్యార్థులతో రూపొందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ గణితం పట్ల ఆసక్తి పెంచుకోవాలని పిలుపునిచ్చారు. గణితానికి, ఇతర సబ్జెక్టులకు గల వ్యత్యాసాన్ని విద్యార్థులకు వివరించారు. గణితం బాగా నేర్చుకున్న విద్యార్థి సమాజంలోని సమస్యలకు పరిష్కారం చూపగలడన్నారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు సత్యనారాయణ, రామలింగ స్వామి, ఉపాధ్యాయులు లక్ష్మి, ఈశ్వరరావు, దావీద్, చంద్రకళ, జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.


బలిజిపేట: పలగర ప్రాథమిక పాఠశాల వద్ద రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంఈఓ సామల

గణిత శాస్త్రవేత్తను ఆదర్శంగా తీసుకోండి

బలిజిపేట: గణిత శాస్త్రవేత్త శ్రీనివాసన్ రామానుజన్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఎంఈఓ-1సామల సింహాచలం సూచించారు. ఈ మేరకు పలగర ప్రాథమిక పాఠశాల వద్ద శ్రీనివాస రామానుజన్ జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణిత పితామహుడు శ్రీనివాసన్ అని కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా అందరం నడుచుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాలను పర్యవేక్షించి, రికార్డులు, 'ఉపాధ్యాయుల లెసన్‌ప్లాన్, డైరీలు, రికార్డులను, విద్యార్థుల నైపుణ్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మక్కువలో..

మక్కువ: మండలంలోని వెంకట భైరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని హెచ్ఎం రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పాఠశాల విద్యార్థులు పలు రకాల లెక్కలు, హెచ్‌బీ మోడల్స్ తయారుచేసి ప్రదర్శించారు. అంతకు ముందు ఎగ్జిబిషన్, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మక్కువ: గణిత దినోత్సవం జరుపుకుంటున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సూత్రం తెలిస్తే గణితం సులువు

సాలూరు: సూత్రాలు తెలుసుకోవడం ద్వారా గణితం సులభతరమవుతుందని మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ జర్జాపుదీప్తి అన్నారు. జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా శుక్రవారం సాయంత్రం పట్టణంలోని ఆర్యవైశ్యధర్మశాలలో నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గణితం కష్టమనే భావనను విద్యార్థులు విడనాడాలన్నారు. అనేక పోటీపరీక్షలకు గణితం మూలమని చెప్పారు. పట్టణ రామానుజన్ మేథ్స్ క్లబ్ వ్యవస్థాపకుడు డా.రంభ రజనీకాంత్ మాట్లాడుతూ, ఇష్టంతో చేస్తే గణితంపై పట్టు సాధించడం సులభమన్నారు.గణిత ప్రతిభా పరీక్షల్లో విజేతలకు అర్బన్ బ్యాంకు చైర్మన్ జర్జాపు ఈశ్వరరావు, ప్రముఖులు డా.వాడాడ గణేశ్వరరావు, డా.ఆరిశెట్టి మోహనరావు, జర్జాపు సూరిబాబు తదితరులు బహుమతులు అందించారు.


సాలూరు: విజేతలకు జ్ఞాపికలు అందిస్తున్న ప్రముఖులు

సీతానగరంలో ట్యాబ్‌ల పంపిణీ


విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు, ఎంఈఓలు, ఉపాధ్యాయులు

సీతానగరం: రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న బైజూస్ ట్యాబ్‌ల వల్ల విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయని, విద్యార్థులు తమంతటతాము నేర్చుకునే అవకాశం కలిగిందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. సీతానగరం మండలంలోని మరిపివలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు చేతుల మీదుగా ఎంఈఓలు జి.సూరిదేముడు, ఎంపీ రమణల ఆధ్వర్యంలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదకుటుంబాల్లో విద్యా కుసుమాలు విరాజిల్లాలనే సంకల్పంతో బైజూస్ పథకం ద్వారా కోట్లాది రూపాయిలు ఖర్చుచేసి విద్యార్థులకు ట్యాబ్‌లు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి.శ్రీరాములు నాయుడు, సర్పంచ్ సీహెచ్ అప్పన్నమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, పార్వతీపురం పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కె బాలకృష్ణ, ఉపాధ్యాయులు వి.తవిటి నాయుడు, విద్యార్థుల పేరెంట్స్ పాల్గొన్నారు.

పీఎం జన్‌మాన్ వివరాలు అప్‌డేట్ చేయాలి

- ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్


సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్


బ్రోచర్ విడుదల చేస్తున్న ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్

పార్వతీపురంటౌన్: పీఎం జన్‌మాన్(ప్రధానమంత్రి జన్ జాతీ ఆదివాసీ న్యాయ మహా అభయాన్) కింద పీవీటీజీలకు వివిధ పథకాల మంజూరుకు వివరాలను అప్‌డేట్ చేయాలని ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ ఆదేశించారు. ఈ మేరకు పీఎం జన్‌మాన్‌పై సంబంధిత అధికారులతో శుక్రవారం ఆయన స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీవీటీజీలకు శతశాతం గృహాలు మంజూరు చేయాలని సూచించారు. పీఎం జన్‌మాన్ కార్యక్రమం గురించి ఎంపీడీఓల వద్ద వివరాలు ఉన్నాయని, వాటిని సంబంధిత అధికారులంతా వెంటనే పరిశీలించి అవసరమైన మార్పుచేర్పులు చేయాలని చెప్పారు. ఆయా పథకాలకు సంబంధించిన సమాచారాన్ని శాఖాధికారులు ప్రజలకు వివరించాలని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, జిల్లా పంచాయతీ రాజ్ అధికారి డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ, హౌసింగ్ పీడీ రమేష్, జిల్లా పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ కె.శ్రీనివాసరావు, టీపీఎంయూ ఏపీడీ వై.సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాతృమరణాలు నివారించాలి

మాతృ మరణాలు నివారించాలని పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ అన్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గిరిజనుల్లో ఆరోగ్య అవగాహన కల్పించాలని చెప్పారు. రక్తహీనతపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. రక్తహీనత కారణంగా గర్భిణుల్లో అధికంగా ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలున్నాయన్నారు. గర్భిణుల ఆరోగ్యంపట్ల శ్రద్ధవహించి, హైరిస్క్ గర్భిణులు ఉంటే మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పౌష్టికాహారం విధిగా అందించాలని, మహిళా శిశుసంక్షేమశాఖ సరఫరా చేస్తున్న పౌష్టికాహార కిట్లను పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. గర్భిణులకు పౌష్టికాహారం ఆవశ్యకత ఉందన్నారు. హైరిస్క్ గర్భిణులు ఉంటే ప్రసవ తేదీలు గుర్తించి అందుకు తగిన విధంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. కౌమార దశలో ఉన్న బాలికల్లో రక్తహీనత పరీక్షించాలని, సంక్రమిత, అసంక్రమిత వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా.బి.జగన్నాథరావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ శివకుమార్, జిల్లా మలేరియా అధికారి శ్యామ్ కుమార్, పీహెచ్‌సీ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి నిర్ధారణ బ్రోచర్ విడుదల

కుష్ఠువ్యాధి నిర్ధారణ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను ఐటీడీఏ పీఓ సి. విష్ణుచరణ్ శుక్రవారం విడుదల చేశారు. ఈ మేరకు ఐటీడీఏ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 27 నుంచి జనవరి 9 వరకు రోజుకు 50 ఇళ్ల చొప్పున ఏఎన్‌ఎం, ఆశవర్కర్లు ఇంటింటికి వెళ్లి కుష్ఠు వ్యాధి సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డి.శివకుమార్, జిల్లా లెప్రసీ అధికారి ఎ.శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హేచరీ పునఃప్రారంభంపై సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ శ్రీధర్‌రాజా

భోగాపురం: మండలంలోని దిబ్బలపాలెం గ్రామ సమీపంలో మూసివేసిన ఎఫెక్స్ హేచరీ పునఃప్రారంభానికి యాజమాన్యానికి అవకాశం కల్పించాలని డీపీఓ శ్రీధర్‌రాజాను దిబ్బలపాలెం, చేపల కంచేరు గ్రామస్తులను విజ్ఞప్తి చేశారు. గతంలో హేచరీ యాజమాన్యం, గ్రామస్తుల మధ్య తలెత్తిన చిన్న చిన్న వివాదాల కారణంగా హేచరీని మూసివేశారు. మరలా హేచరీని ప్రారంభించడానికి అవకాశం కల్పించాలని కోరుతూ సంబంధిత యాజమాన్యం కలెక్టర్‌ను ఆశ్రయించారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఓ శ్రీధర్‌రాజా, మత్స్యశాఖ డీడీ నిర్మలాకుమారి శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హేచరీ సిబ్బంది, దిబ్బలపాలెం, చేపలకంచేరు గ్రామస్తులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామస్తులు మాట్లాడుతూ, గతంలో హేచరీ యాజమాన్యం గ్రామంలో గుడి నిర్మాణానికి నిధులు ఇస్తామని ఇంతవరకు ఇవ్వలేదన్నారు, గుడి నిర్మాణానికి నిధులు ఇవ్వాలని డీపీఓ ద్వారా గ్రామస్తులు హేచరి సిబ్బందిని కోరారు. దీనిపై హేచరి యాజమాన్యం స్పందిస్తూ త్వరలోనే ఆలోచించి ఒక నిర్ణయం తీసుకుంటామని చెప్పడంతో డీపీఓ సమావేశాన్ని వచ్చే మంగళవారానికి వాయిదా వేశారు. సమావేశంలో ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు, తహసీల్దార్ చింత బంగార్రాజు, ఎఫ్‌డీఓ చాందిని, ఈఓపీఆర్‌డీ సురేష్, హేచరీ మేనేజర్ సీహెచ్ రాంబాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి..


మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రినాథులు

పాలకొండ రూరల్: క్షేత్రస్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేపడుతున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని సచివాలయాల పరిధిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఎంపీడీఓ డొంక త్రినాథులు అన్నారు. మండల పరిధిలోని 22 సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఔత్సాహిక క్రీడాకారుల రిజిస్ట్రేషన్ల మేరకు ప్రతి సచివాలయానికీ రెండు జట్లను సిద్ధం చేయాలన్నారు. రోజువారీ నివేదికలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే ప్రస్తుత సీజన్‌లో ప్రజల ఆరోగ్య స్థితిగతులపై దృష్టి సారించాలని.. ఆర్‌బీకేల ద్వారా అవసరమైతే రైతులకు సహకరించాలని కోరారు.

వేగవంతంగా మ్యూజియం పనులు

సీతంపేట: గిరిజన మ్యూజియం పనులు వేగవంతం చేయాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కల్పనాకు మారి ఆదేశించారు. శుక్రవారం స్థానిక పాత పీఎంఆర్‌సీలో జరుగుతున్న మ్యూజియం పనులను టూరిజం శాఖ ఆర్‌డీ పి.శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. పనులు పూర్తి చేయడానికి కావాల్సి న నిధులు త్వరితగతిన విడుదల చేసేందుకు చర్య లు తీసుకోవాలని ఆర్‌డీకి సూచించారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ జిల్లా మేనేజర్ నారాయణ రావు, జాయింట్ మేనేజర్ హరేరామ్, ఈఈ సింహాచలం, ఏఈ మోహన్‌గోపాల్, తదితరులు పాల్గొన్నారు.